www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 4 ఆగస్టు 2025
5
పశ్చిమ గోదావరి



సాగర తీరంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు


బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

మండలంలోని పేరుపాలెం, కేపీ పాలెం గ్రామాలలో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సర్వి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.

జిల్లా పరిషత్ ఆస్తులకు.. రక్షణ కరువు..!



జిల్లా పరిషత్ కార్యాలయ భవనం

ఏళ్లనాటి చెట్లు కొట్టేసి నిబంధనలకు విరుద్ధంగా స్థలం లీజుకిచ్చే వ్యూహం

చెట్ల పెంపకంపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చర్యలు.. ఇక్కడ నరికివేత

సెక్షన్ల ఆధునికీకరణకు రూ. 90.15 కోట్లు మంజూరు

ఎసిలతో సహా ఇప్పటికీ ఏ ఒక్కటీ ఏర్పాటు చేయని పరిస్థితి..

జెడ్‌పి ఆవరణలోని షాపుల అద్దెల వసూళ్లపై ఆరోపణలు

ఉద్యోగుల సంఘం భవనం కమర్షియల్‌కు ఇచ్చినట్లు ఫిర్యాదులు రావడంతో రద్దు

50 శాతం ప్రాతిపదికన మళ్లీ నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చేందుకు ప్రణాళిక


నరికేసిన చెట్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధుల అత్యాశ, అధికారులు అధికార దుర్వినియోగం జిల్లా పరిషత్‌కు పెనుశాపంగా మారిందన్న చర్చ సర్వత్రా సాగుతోంది. ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. జిల్లా పరిషత్ ఆవరణలో ప్రధాన గేటు పక్కగా దశాబ్దాల కాలం నాటి చెట్లు ఉన్నాయి. పర్యావరణానికి పట్టుకొమ్మగా ఉన్న చెట్లపై పాలకుల కన్ను పడింది. ఈ చెట్లు నరికి అక్కడ స్థలాన్ని తమ అనుయాయులకు నిబంధనలకు విరుద్ధంగా లీజులకు ఇవ్వాలని ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. ఏళ్లనాటి చెట్లను తొలగించేందుకు ఆదివారం ప్రయత్నించగా మీడియాలో రావడంతో నిలిపివేశారు. ఎలాగైనా చెట్లను తొలగించాలన్న కుట్రతో అటవీశాఖ ద్వారా తమకు అనుకూలంగా అనుమతులు తెచ్చుకుని నిద్రమన్ను, మర్రిచెట్లతోపాటు, రెండు అశోక్ చెట్లను నరికివేశారు. అటవీశాఖ మంత్రి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చెట్లు పెంచాలంటూ పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. మరోపక్క అదే శాఖకు సంబంధించిన ఆవరణలోని దశాబ్దాల కాలంనాటి చెట్లను నరికివేసిన పరిస్థితి నెలకొంది. ఆ స్థలాన్ని దెందులూరుకు చెందిన ఓ నాయకుడికి లీజుకు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారుల నుంచి గానీ, ఇతర ప్రజా ప్రతినిధుల నుంచి గానీ సరైన స్పందన లేకుండా పోయింది. జెడ్‌పి ఆవరణలో షాపులు కట్టి వాటిని అద్దెకు ఇచ్చారు. వాటికి సంబంధించి అద్దెలు సక్రమంగా వసూలు చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి వివరాలను అధికారులు సైతం బయటపెట్టడం లేదు. పాలకులకు అధికారులు ఏకపక్షంగా కొమ్ముకాస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

సెక్షన్ల ఆధునికీకరణ నిధులపైనా ఆరోపణలు..

జిల్లా పరిషత్ ప్రధాన కార్యాలయంలో సెక్షన్లను ఆధునికీకరించేందుకు 2024 జనవరిలో రూ. 90.50 లక్షలకు సంబంధించి పనులకు శంకుస్థాపన చేశారు. సెక్షన్ కార్యాలయాలకు తలుపులు పెట్టడం తప్ప ఇతర పనులు ఏవీ చేయలేదని తెలుస్తోంది. ఈ నిధులతో సెక్షన్ కార్యాయాలన్నింటిలోనూ ఎసిలు ఏర్పాటు చేయడంతోపాటు, ఇతర పనులు చేయాల్సి ఉన్నా జరగలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పటికీ జెడ్‌పి ఉద్యోగులు ఉక్కపోతలోనే పనిచేస్తున్న పరిస్థితి నెలకొంది. రూ.90 లక్షల నిధులు దేనికి ఖర్చుచేశారో తెలియని పరిస్థితి. జిల్లా పరిషత్ సెక్షన్ల కార్యాలయాల్లో కంప్యూటర్లు సరిగ్గా పని చేయడం లేదు. పాతబడిపోయాయి. పనులు సకాలంలో చేయలేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంప్యూటర్లను మాత్రం మార్చడం లేదు. జిల్లాకు తలమానికంగా ఉండే జిల్లా పరిషత్‌లో ఇటువంటి పరిస్థితి ఏర్పడడం అత్యంత దారుణమని చెప్పొచ్చు.

ఉద్యోగుల సంఘం భవనం వ్యవహారంలో దొంగాట

జెడ్‌పి ఆవరణలో నిర్మించిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ భవనం వ్యవహారంలో జిల్లా పరిషత్ పాలకులు, అధికారులు దొంగాట ఆడుతున్న పరిస్థితి నెలకొంది. ఉద్యోగుల సంఘానికి ఉచితంగా 125 గజాల స్థలం కేటాయించారు. ఉద్యోగ సంఘం అవసరాలకు తప్ప కమర్షియల్‌గా ఉపయోగించకూడదనే నిబంధనలు ఉన్నాయి. ఆ స్థలంలో నిర్మించిన ఉద్యోగ సంఘం భవనంలో కింది ఫ్లోర్‌ను అద్దెకు ఇచ్చేందుకు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉత్వర్వులు ఇచ్చారు. దీనిపై మీడియాలో కథనాలు రావడం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో జిల్లా పరిషత్ అధికారులు సదరు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు మళ్లీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడు కొత్తగా మరో గూడు పుఠాణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా ఉద్యోగుల సంఘం భవనాన్ని కమర్షియల్‌కు ఇవ్వాలని పాలకులు, అధికారులు చూస్తున్నారు. వచ్చే అద్దెలో 50 శాతం జిల్లా పరిషత్‌కు, 50 శాతం ఉద్యోగ సంఘానికి చెందేలా కొత్తగా ఫైల్ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగుల సంఘం భవనం కమర్షియల్‌కు ఇవ్వకూడదని గతంలో కలెక్టర్లు జారీ చేసిన ఉత్తర్వులను తుంగలోతొక్కి జిల్లా పరిషత్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. జిల్లా పరిషత్ ఆస్తులను రక్షించాల్సిన పాలకులు, అధికారులే 'కంచే చేను మేసిన చందంగా' చేస్తున్న పనులు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. జిల్లా పరిషత్‌లో జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం జోక్యం చేసుకుని విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు మరిన్ని భయటపడే పరిస్థితి ఉంటుంది. లేకపోతే జిల్లా పరిషత్ ఆస్తులు అన్యాక్రాంతం అవ్వడంతోపాటు, నిధులు సైతం దుర్వినియోగం అయ్యే పరిస్థితి నెలకొంది.

మహిళా సాధికారతే లక్ష్యం

డ్వాక్రా మహిళలకు అవసరానికి అనుగుణంగా రుణాలు

ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు ప్రత్యేక రుణాలు

గుర్రపు డెక్కతో వర్మీ కంపోస్ట్, వివిధ వస్తువుల తయారీకి యూనిట్ల ఏర్పాటు

నూతనంగా 3,998 స్పౌజ్ పింఛన్ల పంపిణీ

డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్‌ఎస్.వేణుగోపాల్





ప్రజాశక్తి - భీమవరం

డ్వాక్రా మహిళలకు విరివిగా రుణాలు మంజూరు చేస్తూ మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్‌ఎస్.వేణుగోపాల్ అన్నారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి మహిళల ఆర్థిక ఉన్నతికి ప్రత్యేక రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. శ్రీనిధి ద్వారా రూ.220 కోట్లు, ఉన్నతి ద్వారా రూ.8.5 కోట్లు అందించాలని లక్ష్యంగా తీసుకున్నట్లు తెలిపారు. అలాగే మహిళలకు అవసరం మేర కావాల్సిన రుణాలు అందిస్తున్నామన్నారు. అలాగే అన్ని రంగాల్లోని మహిళలను ప్రోత్సహించి వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను రూపుమాపేందుకు ప్రభుత్వం నిరంతరం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలకు రుణాలు, పెన్షన్ల పంపిణీ, పెన్షన్ల మంజూరు, మహిళల అభివృద్ధి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజాశక్తి ముఖాముఖిలో డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్ వివరించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని డ్వాక్రా సంఘాలు ఉన్నాయి? ఎంతమంది సభ్యులున్నారు?

జిల్లాలో 20 మండలాలు ఉన్నాయి. సుమారు 900 మంది విలేజ్ ఆర్గనైజర్లు పనిచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 30 వేల డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. దీనిలో 3 లక్షల 10 వేల మంది సభ్యులు ఉన్నారు.

ప్రశ్న : మహిళల ఆర్థిక అవసరాలకు ఎటువంటి రుణాలు అందిస్తున్నారు?

మహిళల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా రుణాలు మంజూరు చేస్తున్నాం. చిన్న చిన్న కుటీర పరిశ్రమల ఏర్పాటుకు చేయూతనిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 13 వేల మందిని మైక్రో క్రెడిట్ ప్లాన్‌లో చేర్చాం. ప్రతి మహిళకూ రుణాలందించేందుకు రూ.690 కోట్లు లక్ష్యంగా తీసుకోగా ఇప్పటివరకూ రూ.155 కోట్లు మంజూరు చేశాం.

ప్రశ్న: స్త్రీనిధి, ఉన్నతి రుణాల లక్ష్యం ఎంత. ఇప్పటివరకూ ఎన్ని రుణాలు మంజూరు చేశారు?

సంఘాలకు గ్రూపు రుణాలతో పాటు స్త్రీ నిధి రుణాలు కూడా అందిస్తున్నాం. రూ.220 కోట్లు అందించాలని లక్ష్యంగా తీసుకున్నారు. ప్రతి నెల రూ.25 కోట్లు తగ్గకుండా మంజూరు చేస్తున్నాం. ఉన్నతి రుణాలకు సంబంధించి ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు అందిస్తున్నాం. రూ.8,50 కోట్లు అందించాలని లక్ష్యంగా తీసుకోగా ఇప్పటివరకూ రూ.70 లక్షల వరకూ అందజేశాం. ప్రతి ఎస్‌సి, ఎస్‌టి మహిళకూ గ్రూపుతో సంబంధం రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకూ అందిస్తున్నాం.

ప్రశ్న : గుర్రపు డెక్కతో వర్మీ తయారీ, వివిధ వస్తువుల తయారీ యూనిట్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు?

నిడ్దాద్ర వోలు, గొల్లవానితిప్ప గ్రామాల్లో ఏర్పాటు చేశాం. గొల్లలకోడేరులో ఏర్పాటు కావాల్సి ఉంది. గుర్రపు డెక్క ద్వారా తయారు చేస్తున్న వర్మీలో మొక్కలకు కావాల్సిన ఎన్నో విలువైన పోషకాలు ఉన్నాయి. ఆక్వా సాగుతో పాటు హార్టీకల్చర్, వ్యవసాయం, పూల మొక్కలు ఇలా ఎన్నో వాటికి ఈ వర్మీ ఎంతో బాగా పనిచేస్తుంది. ముఖ్యంగా గుర్రపు డెక్కతో వివిధ వస్తువులు తయారు చేయడం జరుగుతుంది.

ప్రశ్న: ఎన్ని యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా తీసుకున్నారు? ఎంత రుణం అందిస్తున్నారు. ఎంత ఆదాయం సమకురుతు?

జిల్లా వ్యాప్తంగా 60 యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా తీసుకున్నాం. ఒక్క యూనిట్‌కు రూ.50 వేల రుణం అందిస్తున్నాం. రెండు నెలలు వర్మీ తయారవుతుంది. రూ.15 వేల నుంచి రూ. 20 వేల వరకూ ఆదాయం సమకూరుతుంది.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని పెన్షన్లు ఉన్నాయి? ప్రతి నెలా ఎంత సొమ్ము అందిస్తున్నారు?

జిల్లా వ్యాప్తంగా 2,29,695 లక్షల వివిధ రకాల పెన్షన్లు ఉన్నాయి. ప్రతి నెలా రూ.97,74 కోట్ల సొమ్మును పెన్షన్ లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుంది.

ప్రశ్న : పెన్షన్ల వెరిఫికేషన్ పూర్తి అయిందా?

ఇటీవల జిల్లాలో ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి పెన్షన్ల వెరిఫికేషన్ చేశాం. ముఖ్యంగా వికలాంగులకు సంబంధించిన 27,850 వేల పెన్షన్ల వెరిఫికేషన్ పూర్తిచేశాం. అలాగే 1500 బెడ్ రీడింగ్ పేషెంట్ల పెన్షన్ల వెరిఫికేషన్ కూడా జరుగుతుంది.

ప్రశ్న : నూతనంగా పెన్షన్లు ఏమైనా మంజూరయ్యాయా?

జిల్లా వ్యాప్తంగా 3,998 వేల స్పౌజ్ పెన్షన్లు మంజూరయ్యాయి. ఈ నెల ఒకటో తేదీన సాధారణ పెన్షన్లతోపాటు స్పౌజ్ పెన్షన్ కూడా పంపిణీ చేశాం.

ప్రశ్న : పెన్షన్ల కోసం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు?

గతంలో 6 వేల మంది వరకూ పెన్షన్లు దరఖాస్తు చేసుకున్నారు. అదనంగా మరో నాలుగు వేల మంది వరకూ ఉంటారు. జిల్లా వ్యాప్తంగా నూతనంగా 10 వేల పెన్షన్లు అందించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పెన్షన్లు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.

రాఘవేంద్రరావు ట్రస్టు సేవలు అభినందనీయం

శివదేవునిచిక్కాలలో శ్మశాన వాటికను ప్రారంభించిన మంత్రి నిమ్మల


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

శివదేవుని చిక్కాల గ్రామంలో నిమ్మల రాఘవేంద్రరావు ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శివదేవుని చిక్కాలలో సిఎస్‌ఆర్ నిధులు రూ.10 లక్షలు, నిమ్మల రాఘవేంద్ర ట్రస్ట్ నిధులు రూ.3 లక్షలు కలిపి రూ.13 లక్షలతో పునర్నిర్మించిన శ్మశానవాటికను ఆయన ప్రారంభించారు. మంత్రి రామానాయుడుకు ట్రస్ట్ నిర్వాహకులు నిమ్మల రామారావు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్టు నిర్వాహకులు రామారావు అభినందనీయులన్నారు. రాష్ట్రంలో మంచి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం తీసుకొస్తున్నామని, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు అమలు చేస్తున్నామని తెలిపారు. పేదరికాన్ని పారద్రోలేలా మార్గదర్శకుల సహకారంతో పి4ను అమలు చేస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని తెలిపారు. ట్రస్టు తరపున మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉన్నమట్ల కబర్థి, ఎఎంసి ఛైర్మన్ కోడి విజయభాస్కర్, మోపిదేవి నరసింహనాయుడు, సర్పంచి దిడ్ల మని వజ్రం పాల్గొన్నారు.

అగ్నిమాపక అధికారుల సేవలు ఎనలేనివి

అగ్నిమాపక కార్యాలయ భవన శంకుస్థాపనలో ఎంఎల్‌ఎ అంజిబాబు, మండలి ఛైర్మన్ మోషేన్ రాజు


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ అంజిబాబు, శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అగ్నిమాపక అధికారుల సేవలు ఎనలేనివని, సుమారు రూ.2 కోట్లలతో జిల్లా అగ్నిమాపక కేంద్ర కార్యాలయాన్ని భీమవరంలో ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.2 కోట్లతో జిల్లా అగ్నిమాపక కార్యాలయ భవనానికి ఆదివారం ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు, ఎంఎల్‌ఎ అంజిబాబు, ఇన్‌ఛార్జి కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ జిల్లా ఏర్పడిన తరువాత అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని, అందులో మొదటిగా అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామమన్నారు. అగ్ని ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినపుడు అగ్నిమాపక అధికారులు తక్షణమే స్పందిస్తారని, వారి సేవలు ఎనలేనివని అన్నారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి అభివృద్ధి సూచిక అని, ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సమాజానికి అగ్నిమాపక అధికారుల అందిస్తున్న సేవలు అద్వితీయమని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకునేలా ఈ కేంద్రంలో మొక్కలను నాటి పెంచాలని అన్నారు. పట్టణంలోని నాలుగు పక్కల ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఎంఎల్‌ఎ అంజిబాబు, ఇన్‌ఛార్జి కలెక్టర్ రాహుల్ కుమార్‌ను మోషేన్ రాజు కోరారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ఆకివీడు-దిగమర్రు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి గ్రీన్ సిగ్నల్

త్వరలోనే పనులు ప్రారంభం : కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ


కేంద్రమంత్రితో మాట్లాడుతున్న సహాయం మంత్రి వర్మ

భీమవరం : ఆకివీడు-దిగమర్రు 165 గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అభ్యర్థన ఫలించింది. రూ.2,500 కోట్ల అంచనా వ్యయంతో 45 కిలోమీటర్ల పొడవైన గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తన కార్యాలయం నుండి విడుదల చేసిన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత 10 నెలలుగా ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకువెళ్లేందుకు తాను చేసిన కృషి ఫలించిందని, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి కీలకమైన ఆకివీడు-దిగమర్రు జాతీయ రహదారికి అనుమతులు సాధించేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని పలు దఫాలుగా కలిసి ఈ ప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకతను తెలియజేసినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో డిజి, నేషనల్ హైవే ఉన్నతాధికారులను కలిసి ప్రాజెక్ట్ టెక్నికల్ సమస్యలను పరిష్కరించి, తిరిగి సర్వే చేయించడం, అలైన్‌మెంట్‌ను ఖరారు చేయించడం జరిగిందన్నారు. అత్యాధునికమైన, సురక్షితమైన జాతీయ రహదారిని త్వరలో నర్సాపురం పార్లమెంట్ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంతో డెల్టా ప్రాంతంలో రవాణా వ్యవస్థ మెరుగుపడి, ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు లభిస్తాయని, భీమవరం పట్టణానికి ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సానుకూలంగా స్పందించి అనుమతి ఇచ్చి సహకరించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక సురక్ష పథకాలను వినియోగించుకోవాలి

ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు

పోడూరు : ప్రభుత్వం అందించే ప్రధానమంత్రి సామాజిక సురక్ష పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ బ్యాంక్ పోడూరు శాఖ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. పోడూరు గ్రామంలో సంత మార్కెట్, పెద్ద పేటలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం కింద సామాజిక భద్రతా పథకాలు, ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాల నివారణపై ప్రజలకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో ఇటీవల పెను మార్పులు చోటు చేసుకున్నాయని, బ్యాంకు ఖాతాదారులు నగదు, రైతు లావాదేవీలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని దుర్గారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలైన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలపై ఖాతాదారులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. బ్యాంకు పరిధిలోని ప్రజలందరూ ముఖ్యంగా పేద తరగతులకు చెందిన వారందరూ పిఎం ఆర్థిక భరోసా పథకాలు వినియోగించుకుని కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన బ్యాంకు మిత్ర పాయింట్ల సదుపాయాలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని బ్యాంక్ మేనేజర్ సూచించారు. బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఎన్.మునిచరణ్ మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. సైబర్ స్కామ్‌లు, ఫిషింగ్ మోసాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సురక్షా చర్యల గురించి కూడా వివరించారు. ప్రజలు తమ ఆర్థికపరమైన డేటాను ఎలా సురక్షితంగా ఉంచుకోవాలనే దిశగా సూచనలు అందించారు. మొబైల్ ఫోన్‌కి వచ్చే ఒటిపిలు ఎవరికీ చెప్పవద్దని తద్వారా బ్యాంక్ ఖాతాలోని డబ్బు పోగొట్టుకోవద్దని, టెక్నాలజీ పరంగా ముందుకు వెళుతున్నప్పటికీ ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్తగా మెలగడం ద్వారా అదుపు చేయడం సులభమే అన్నారు. అపరిచిత వ్యక్తులు మీకు ఫోన్ చేసి లేదా మెసేజ్‌లు పెట్టి మీరు బ్యాంకు లోన్‌కు అర్హుడవని, మీకు లాటరీ తగిలిందని, ఆన్‌లైన్ ఉద్యోగాలు ఉన్నాయని తదితర విషయాలపై ఆశ చూపి ప్రజలకు కొంత సొమ్ము వేసి వాళ్ల నుంచి ఒటిపి అడిగి, లేదంటే యాప్ ఇన్‌స్టాల్ చేసుకోమంటారు. చేసుకున్న వెంటనే మన ఫోను వాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోయి మన ఖాతా నుండి సొమ్ము మొత్తం కొల్ల కొడతారన్నారు. ఇది క్లిక్ చేయండి, అది క్లిక్ చేయండి అని మెసేజ్లు లేక ఫోన్ కాల్స్ వస్తాయి వాటిని నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ విషయాలను ప్రజలందరికీ తెలియజేయాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు, ఆర్‌బిఐ, పలువురు అధికారులు పలుసార్లు హెచ్చరించినా చదువుకున్న వారు కూడా మోసాలు బారిన పడుతున్నారని తెలిపారు. పోడూరు పరిధిలోని ఇప్పటికే పలు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామని ఎవరైనా కోరితే ఆయా గ్రామాల్లో నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని బ్యాంక్ మేనేజర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, బ్యాంక్ మిత్రలు సుశీల, దొంగ పాండురంగ, పుచ్చకాయల వసంత కుమార్, బ్యాంక్ ఖాతా దారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఇంజేటి శ్రీనివాస్

భీమవరం టౌన్ : అదానీ స్మార్ట్ మీటర్ నిలిపివేయాలి, పెట్టిన మీటర్లు తొలగించాలి, ట్రూ ఆఫ్ ఇంధన సర్దుబాటు, ఎఫ్‌ఎపిపిసి ఛార్జీల విధానాన్ని పూర్తిగా తొలగించాలి, అదనపు భారాలు తగ్గించాలని ఈనెల 5వ తేదీన విద్యుత్ కేంద్రం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని రూరల్ తోకతిప్ప గ్రామంలో అదానీ స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఎక్కడ పెడుతున్న ప్రజలందరూ కలిసి అడ్డుకోవాలన్నారు. అనుమతి లేకుండా మీటర్లు పెడితే కేసులు పెట్టండని తెలిపారు. గతంలో చెత్త పన్నుపై పోరాడితే రద్దు అయ్యింది, వ్యవసాయ పంపు చెట్లకు మీటర్లు ఆగాయి, పశ్చిమబెంగాల్‌తో సహా అనేక రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లను ప్రజా ఉద్యమాలతో ఆపగలిగారని అన్నారు. ఈనెల 5వ తేదీన విద్యుత్ కేంద్రం వద్ద జరిగే ధర్నాలో ప్రజలందరూ కలిసి పాల్గొని స్మార్ట్ మీటర్లు అడ్డుకుందాం-విద్యుత్ ఛార్జీలు తగ్గించుకుందామని పిలుపునిచ్చారు. పొన్నమండ నాగేశ్వరావు, తిరుమణి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పోరాటాలతోనే మహిళా సమస్యల పరిష్కారం

ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ

యలమంచిలి : సమాజంలోని మహిళా సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలే శరణ్యమని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. మండలంలోని చించినాడ శెట్టిబలిజిపేట కమ్యూనిటీ వద్ద అమరజీవి తెన్నేటి లక్ష్మీ సభా ప్రాంగణం వద్ద ఐద్వా 8వ మండల మహాసభ బాతిరెడ్డి సుగుణ అధ్యక్షతన జరిగింది. సభ ప్రారంభానికి ముందుగా ఐద్వా జెండాను సీనియర్ నేత చెల్లుబోయిన చంద్రావతి ఆవిష్కరించగా గత మూడు సంవత్సరాల కాలంగా సంఘం తరపున చేసిన పోరాటాలు, కార్యక్రమాల నివేదికను మండల కార్యదర్శి జిల్లెల్ల ప్రశాంతి ప్రవేశ పెట్టారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథి పూర్ణ మాట్లాడుతూ మద్యం మత్తులో క్రూర మృగాలుగా మారుతున్న కొందరు మగాళు కామంతో కళ్లు మూసుకుపోయి బాలికలు, మహిళలు, వృద్ధులపై దాడులకు తెగబడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఎద్దేవ చేశారు. మద్యాన్ని నియంత్రించాల్సింది పోయి మద్యాన్ని మరింత ఏరులై పారిస్తూ.. కుటుంబాల నాశనానికి కారణమవుతుందని, ఇది చాలా విచారకరమని, ఇటువంటి చర్యలను అడ్డుకోవాలంటే మహిళలంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. నాయకులు జిల్లెల్ల ప్రశాంతి, పొత్తూరి జ్యోతి, మల్లుల నాగలక్ష్మి, గొల్ల విజయకుమారి, ముస్కూడి జయశ్రీ పాల్గొన్నారు.

ఫుడ్ డెలివరీ బాయ్‌కి కానిస్టేబుల్ ఉద్యోగం

యువతకు ఆదర్శంగా నిలిచిన నాగేంద్ర


నాగేంద్ర

పాలకోడేరు : ఒక సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన అతనికి చదువు అంటే ఎంతో ఇష్టం. కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా కష్టపడి ఇష్టంతో చదివాడు. ఒకపక్క ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ మరోపక్క సివిల్‌కు సాధన చేస్తూ సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. గొల్లలకోడేరు గ్రామం తుమ్మలగుంట పాలెంకు చెందిన కాలా నాగేంద్ర ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ పరీక్షా ఫలితాల్లో 200కి గాను 132 మార్కులు సాధించి సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన నాగేంద్ర 10వ తరగతిలో పాఠశాలో ప్రథమ స్థానం సాధించాడు. తర్వాత పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ చేశాడు. తర్వాత ఆర్థిక ఇబ్బందులు వెంటాడినప్పటికీ అవేమీ పట్టించుకోకుండా అనుకున్న లక్ష్యం వైపు ప్రయాణం చేశాడు. యువతలో పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అనడానికి నాగేంద్ర నిలువెత్తు నిదర్శనంగా నిలిచాడు. గ్రామస్తులు స్నేహితులు నాగేంద్రను అభినందించారు.

ఎస్ఐ ఉద్యోగం సాధించాలనుకున్న : నాగేంద్ర


ఎస్ఐ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా తీసుకున్నాను. తృటిలో చేజారింది. మా నాన్న ఆరోగ్యం బాలేకపోవడంతో పరీక్షకు ఆలస్యంగా వెళ్లాను. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో జొమోటో, రాఫిడో వంటి వాటిలో ఫుడ్ డెలివరీ బాయ్ గా పని చేసుకుంటూ దాతల సాయం తీసుకుంటూ సాధన చేశాను. ఒకే గదిలో నలుగురు కలిసి ఉంటూ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. కష్టపడి చదువుకుని సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సంపాదించడం ఎంతో ఆనందంగా ఉంది.


మహిళను ధరలు వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంఎల్‌ఎ అంజిబాబు

రైతు బజార్ పరిశీలన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం రైతు బజార్‌ను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు బజార్‌లో స్టాల్స్‌ను పరిశీలించి కూరగాయల ధరల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలున్నాయా అని వినియోగదారులను అడిగారు. మీ సమస్య ఏదైనా అండగా ఉంటానని, అందుబాటులోనే ఉంటానని ఎంఎల్‌ఎ తెలిపారు. రైతు బజారు వెనుక వైపు కూడా గేట్లు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్‌కు ఇబ్బంది ఉండదని పలువురు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకు వచ్చారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నంబూరు విజయలక్ష్మి నారాయణ

దేవస్థానం ఛైర్మన్‌గా నంబూరు విజయలక్ష్మి నారాయణ

ప్రజాశక్తి - ఆచంట

శ్రీమదన గోపాల స్వామి దేవస్థాన నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం ఆదివారం ఆచంటలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మదన గోపాలస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా జనసేన మండల అధ్యక్షులు నంబూరి విజయలక్ష్మి నారాయణ(విజయ్) ప్రమాణ స్వీకారం చేశారు. పాలకవర్గ సభ్యులుగా పోకనాటి ప్రేమ్‌కుమార్, బిలుకూరి సురేష్, చెప్పిడి దుర్గారావు, బండా సతీష్ కుమార్ శర్మ, మల్లవరపు సత్యవతి, అప్పారి దుర్గా మల్లీశ్వరి, మానేపల్లి రత్నకుమారి, పోనమాల కవిత, వాడపల్లి గోపాలాచార్యులు(అర్చకులు)లచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఛైర్మన్ నంబూరి విజయలక్ష్మి నారాయణ(విజయ్) మాట్లాడుతూ దేవస్థానం ఛైర్మన్‌గా తనకి ఈ అవకాశం ఇచ్చిన ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణకు ఎంతో రుణపడి ఉంటానన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, అన్నపూర్ణ దంపతులు పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, కూటమి నాయకులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, యర్రగుంట్ల నాగరాజు, నిమ్మన శేఖర్, కేతా మీరయ్య, బీరా నరసింహమూర్తి, బలుసు శ్రీరామమూర్తి, కేతా మురళి, ఎంపిటిసిలు ఉన్నారు.

బండి ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యాన ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఎం.జగదీష్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

డిపో నుంచి పార్య పుస్తకాలు సరఫరా

డిపో మేనేజర్ పివి.సుధాకర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెంలో ఉన్న ప్రభుత్వ పుస్తక పంపిణీ డిపో నుండి ఉభయగోదావరి జిల్లాలలోని అన్ని మండలాలకు పాఠ్యపుస్తకాలను, పుస్తకాలను సప్లై చేస్తున్నట్లు ప్రభుత్వ పాఠ్య పుస్తకాల డిపో మేనేజర్ పివి.సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయగోదావరి జిల్లాలో మొత్తం 48 మండలాలకు 12,03,428 లక్షల పుస్తకాలను మండల కేంద్రాలకు ఎపిఎస్‌ఆర్‌టిసి తాడేపల్లిగూడెం డిపో బస్సుల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిరోజు బస్సుకి మూడు మండలాల చొప్పున మండల కేంద్రాలకు పుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో గవర్నమెంట్ బుక్స్ మేనేజర్ పివి.సుధాకర్, ఎపిఎస్‌ఆర్‌టిసి సూపర్‌వైజర్ డి.విజయకుమార్, హమాలీలు, ఆర్‌టిసి బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.



స్నేహితుల దినోత్సవ వేడుకలలో ఆర్యవైశ్య సంఘం మహిళలు

ఘనంగా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాలలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం మొగల్తూరులోని వాసవి వనిత క్లబ్ ఆర్యవైశ్య మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకొని మిఠాయిలు పంచుకున్నారు. మిత్రులకు కష్టాలు వచ్చినప్పుడు అండగా ఉండాలని తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీమకుర్తి అరుణ, అనంతపల్లి అరుణ, కారుమూరి రత్నకుమారి, ప్రభ, అప్పన విజయ ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నేరాలు - ఘోరాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లాకుల వద్ద ఆదివారం ప్రధాన కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. లాకుల వద్ద మృతదేహం ఆగినట్లు ఇరిగేషన్ అధికారులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహం బాగా కుళ్లినట్లు చెబుతున్నారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి శవపరీక్ష కోసం తరలించారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి - మొగల్తూరు

అదనపు కట్నం వేధింపులపై ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జి.వాసు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పేరుపాలెం నార్త్ పంచాయితీ కటికల వారి మెరకకు చెందిన కటికల దుర్గాభవానికి అదే గ్రామానికి చెందిన ముత్యాలుతో మూడు సంవత్సరాల కిందట వివాహం అయ్యింది. గత కొంతకాలంగా భర్త ముత్యాలు అత్త మామలు, ఆడబడుచులు అదనపు కట్నం పుట్టింటి నుండి తీసుకురావాలని వేధిస్తున్నారని బాధితురాలు దుర్గ భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

ఇఇ కె.మధుకుమార్

ప్రజాశక్తి - నరసాపురం

గృహ విద్యుత్ వినియోగదారులు తాము వాడుకుంటున్న అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఎపి విద్యుత్ నియంత్రణ మండలి 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. 2025 డిసెంబర్ 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఎపి సిపిడిసిఎల్ వెబ్‌సైట్‌లో గాని, విద్యుత్ ఉపకేంద్రంలోని అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఒక కిలో వాట్‌కు డెవలప్మెంట్ ఛార్జీలు రూ.2 వేలు కట్టాలి. కానీ ఈ స్కీం కింద వెయ్యి కడితే సరిపోతుంది. సెక్యూరిటీ డిపాజిట్లో మార్పు ఉండదు, కిలోవాట్‌కు రూ.200 కట్టాలన్నారు.

అదనపు లోడ్ అంటే : గృహ అవసరాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సమయంలో వాడే దీపాలు, గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి లోడుల కిలోవాట్లలో లెక్కిస్తారు. ఆమేరకు డెవలప్మెంట్ ఛార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేస్తారు. ఉదాహరణకు 1 వాట్ లోడ్ కనెక్షన్ తీసుకుంటే డెవలప్మెంట్ ఛార్జెస్ రూ.2 వేల సెక్యూరిటీ డిపాజిట్ రూ.200 చెల్లించాలి. అదే రెండు కిలో వాట్‌లకు డెవలప్మెంట్ ఛార్జెస్ రూ.4 వేలు కట్టాలి. ప్రస్తుతం పెరిగిన వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామ, మండల కేంద్రాల్లో కనీసం రెండు కిలోవాట్లు, నగరంలో మూడు కిలోవాట్లు దరఖాస్తు చేసేలా ముందుగానే సంబంధిత ఎఇలు, లైన్‌మెన్‌లు సూచిస్తారు. ఈ లెక్క ప్రకారం ఆ ప్రాంతంలో విద్యుత్ పరివర్తకాలు ఏర్పాటు చేస్తారు. కాగా ఎక్కువ వినియోగం ఉన్నవారు సైతం తక్కువకు అనుమతి తీసుకోవడంతో ఆయా పరివర్తకాలపై లోడు పెరిగి తరచూ ట్రిప్ కావడం లోవోల్టేజీ సమస్యలు పెరుగుతూ ఉంటాయి. ఇప్పుడు 50 శాతం రాయితీ ఇస్తున్నారు. డెవలప్మెంట్ ఛార్జీలు ఒక కిలో వాట్‌కు రూ.1000 కడితే సరిపోతుంది. వినియోగదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.



పాత కనెక్షన్లకు ఎంతో ఉపయోగం : కొన్ని సంవత్సరాల క్రితం కనెక్షన్ తీసుకున్న వారికి వినియోగమన్నారు. అప్పటితో పోలిస్తే మూడు, నాలుగింతలు పెరిగి ఉంటుంది. ఈ అదనపు లోడుతో సమస్య నెలకొంటుంది. తనిఖీల సమయంలో అధికలోడు వినియోగిస్తున్నట్లు సిబ్బంది గుర్తిస్తే జరిమానా విధిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు ముందుకొచ్చి సర్వీస్ క్రమబద్ధీకరించుకునేలా డెవలప్మెంట్ ఛార్జీల్లో 50 శాతం రాయితీ ఇచ్చేలా విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయం తీసుకుంది. గృహ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఇఇ కె.మధుకుమార్ సూచించారు.


అందుబాటులో రైతులకు డ్రోన్ సేవలు

తక్కువ మందుతో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ.. సమయం ఆదా..!

ప్రజాశక్తి - వీరవాసరం

రైతు ప్రయోజనార్థం వ్యవసాయ సాగుకు వీరవాసరంలో డ్రోన్‌లు అందుబాటులోకి వచ్చాయి. గతవారం రోజుల నుంచి రైతులు తమ పంట పొలాలకు డ్రోన్‌లను వినియోగించుకుంటున్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో రైతు గ్రూపులకు డ్రోన్‌లు అందజేశారు. మండలంలో నాలుగు గ్రూపుల వారు డ్రోన్‌లకు దరఖాస్తు చేసుకోగా వీరవాసరంకు చెందిన ఒక గ్రూపు డ్రోన్ అందజేశారు. ఇంకా మూడు గ్రూపుల వారికి మూడు డ్రోన్‌లు అందాల్సి ఉంది. వీరవాసరం, అండలూరు గ్రామాల నుంచి ఈ డ్రోన్ సేవలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం వీరవాసరానికి చెందిన సప్పా సత్యనారాయణ రైతులకు డ్రోన్ సేవలు అందిస్తున్నాడు. ఈయన ఎకరానికి రూ.350కు డ్రోన్ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కూలి రేటు రూ.400 ఉండగా రైతులు డ్రోన్ వినియోగానికి ఆకర్షితులవ్వాలన్న ఉద్దేశ్యంతో తక్కువ రేటుకు నిర్ణయించినట్లు సత్యనారాయణ తెలిపారు. ఒక ఎకరానికి మందు పిచికారీ చేయడానికి ఆరు నిమిషాలు పడుతుందని ఇలా రోజుకు పదిహేను ఎకరాలు డ్రోన్‌తో మందులు పిచికారీ చేయవచ్చన్నారు. రైతులు తమ పంట పొలాలకు డ్రోన్‌తో క్రిమిసంహారక మందులు పిచికారీ చేయించుకుంటే పావు లీటరు వరకు మందు కలిసి వస్తుందని తెలిపారు. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చున్నారు. డ్రోన్ సేవలను రైతులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.


డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేస్తున్న యువకుడు


సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచి ముత్యమాంబ బాబులు

సచివాలయ ఉద్యోగుల సేవలు ఎనలేనివి

సర్పంచి నాగ ముత్యమాంబ


ప్రజాశక్తి - నరసాపురం

యర్రంశెట్టివారి పాలెం సచివాలయంలో ఐదు సంవత్సరాల సేవ పూర్తి చేసి బదిలీ అయిన సిబ్బందికి ఆదివారం సర్పంచి యర్రంశెట్టి నాగ ముత్యమాంబ బాబులు ఆధ్వర్యాన ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సిబ్బందిని శాలువా, మెమెంటో, పూలదండలతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచి నాగ ముత్యమాంబ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా సిబ్బంది ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. సచివాలయ సిబ్బంది బదిలీపై వెళ్లినవారు సర్పంచి నాగముత్యమాంబ బాబులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి వైస్ ఛైర్మన్ బాబులు, ఉప సర్పంచి తెలగంశెట్టి వాసు, శ్రీదేవి, పిట్ట రామారావు, రాంబాబు, పంచాయతీ సెక్రెటరీ ఎస్.రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాలకు నగదు జమ

వ్యవసాయాధికారి బి.దేవీ స్వరూప

పెనుమంట్ర : మండలంలోని గ్రామాల్లో ఇకెవైసి నమోదు పూర్తయిన 4,516 మంది రైతుల ఖాతాలకు ప్రధాన మంత్రి కిసాన్ పథకం కింద రూ.2 కోట్ల 25 లక్షల 80 వేల నగదు జమ అయ్యిందని వ్యవసాయ శాఖ మండల అధికారిణి బి.దేవీ స్వరూప ఇక్కడ తెలిపారు. గ్రామాల వారీగా మాముడూరులో 573, మార్టేరులో 120, పెనుమంట్రలో 765, ఎస్ఐ పర్రులో 430, భట్ల మగటూరులో 335, నెగ్గిపూడిలో 94, ఓడూరులో 167, వెలగలేరులో 69, నత్తా రామేశ్వరంలో 159, మల్లిపూడిలో 179, జుత్తిగలో 400, పొలమూరులో 379, ఆలమూరులో 244, నెలమూరు లో 233, కొయ్యేటిపాడులో 167, సత్యవరంలో 202 మంది రైతులు లబ్ధి పొందారని ఆమె పేర్కొన్నారు.


శ్రీనివాసరాజును అభినందిస్తున్న లయన్స్ ప్రతినిధులు

ఏలూరుపాడు లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా దాట్ల శ్రీనివాసరాజు

కాళ్ల : ఏలూరుపాడు లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా దాట్ల శ్రీనివాసరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరుపాడు గ్రామంలో ఆదివారం లయన్స్ క్లబ్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పలువురు లయన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ 2001లో ఏలూరుపాడు లయన్స్ క్లబ్ ఏర్పడిందని, నాటి నుంచి ఇప్పటి వరకు 25 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి జిల్లాలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ క్లబ్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచి భూపతిరాజు జగ్గరాజు, డాక్టర్ ఆర్‌విఎస్.రాజు, వివి.కృష్ణంరాజు, మోటుపల్లి శ్రీనివాసరావు, మంతెన రవివర్మ, పేర్ని సుబ్రహ్మణ్యం, మంతెన ఆంజనేయరాజు, కనగర్ల గణేష్, మధుసూదనరావు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ బొలిశెట్టి

యువత పారిశ్రామికాభివృద్ధి సాధించాలి

విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

యువత పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తూ స్వయం సమృద్ధితో మరికొందరికి జీవనోపాధి కల్పించే దిశగా ముందుకు అడుగులు వేయాలని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, భవన నిర్మాణ, ఇతర కార్మిక సంఘ ఛైర్మన్ వలవల బాబ్జి పిలుపునిచ్చారు. మండలంలోని జగన్నాథపురంలో నూతనంగా నిర్మించిన అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. నాణ్యమైన మంచినీరు అందరికీ అందించే దిశగా ఈ ప్లాంట్ నిర్వహణ సాగాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్వాహకుడు కాకర్ల కిట్టును అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, ఎఎంసి వైస్ ఛైర్మన్ ముత్యాల సత్యనారాయణ, సర్పంచులు, ఎంపిటిసిలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాలుర, బాలికల అథ్లెటిక్స్ ఎంపికలు

రాష్ట్రస్థాయికి 40 మంది

ప్రజాశక్తి - తణుకు

పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లా స్థాయి అండర్ 14, 16, 18, 20 బాలుర, బాలికల అథ్లెటిక్స్ ఎంపికలను శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించినట్లు అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. బాలుర పోటీలను తణుకు టౌన్ బిజెపి అధ్యక్షులు బొల్లాడ నాగరాజు ప్రారంభించగా, బాలికల పోటీలను తణుకు ఎఎంసి మాజీ ఛైర్మన్ బసవ రామకృష్ణ ప్రారంభించారు. రీజినల్ ఇన్‌స్పెక్టర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ బి.జాన్సన్ మాట్లాడుతూ క్రీడల వల్ల ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి 200 మంది క్రీడాకారులు హాజరవగా వారిలో ప్రతిభ కలిగిన 40 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసారు. క్రీడాకారులకు కొమ్మిశెట్టి రాంబాబు భోజన వసతి ఏర్పాటు చేయడం జరిగింది. అసోసియేషన్ ఛైర్మన్ మానేపల్లి శ్రీనివాసు మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన వారు ఆగస్టు 9 నుంచి 11 వరకు బాపట్ల జిల్లా చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ప్రెసిడెంట్ చింతకాయల సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రభుత్వం మూడు శాతం రిజర్వేషన్ ఇస్తుందన్నారు. ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు కెవిఆర్.సుబ్బారావు, ఆర్.నాగేశ్వరరావు, కె.వెంకన్న బాబు, బి.దిలీప్, కె.సుజాత, ఎం.విజయదుర్గ, కె.వినాయక్ పర్యవేక్షించారు.


రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్

ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం
'అన్నదాత సుఖీభవ' పంపిణీలో ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

గత అయిదేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని జగన్‌మోహన్‌రెడ్డి భ్రష్టు పట్టించారని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. మండలంలోని దువ్వ గ్రామంలో ఆదివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు చెక్కులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ ప్రారంభించి మాట్లాడుతూ.. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని అన్నారు. మద్యం కుంభకోణంలో త్వరలోనే జగన్‌మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమాన్ని అమలు చేస్తూ మరోపక్క అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేవిధంగా రాష్ట్రంలో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని ఏడాది లోపే అమలు చేసి రూ.20 వేలు మూడు విడతల్లో అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 43 లక్షల మంది రైతులకు రూ.2,300 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఇకపై ప్రతి ఏడాది రూ.20 వేలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని చెప్పారు. తణుకు నియోజకవర్గంలో దాదాపు 16 వేల మంది రైతులకు రూ.11.46 కోట్లు అందజేశామన్నారు. రైతుల పక్షాన కూటమి ప్రభుత్వం నిలబడుతుందని మరోసారి రుజువు చేసినట్లు చెప్పారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నెలల తరబడి ధాన్యం డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో విచ్చలవిడిగా అవినీతి చేసి మద్యం కుంభకోణంలో వేలాది కోట్లు పక్కదోవ పట్టించారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో ఇప్పటికే ఒకొక్కరు జైలుకు వెళుతుండగా త్వరలోనే జగన్ సైతం జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఆనాడు పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలను రాష్ట్రం నుంచి తరిమేశారని ఆరోపించారు. పోలవరం, అమరావతి నిర్మాణాలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని చంద్రబాబునాయుడు 2018 వరకు 70 శాతం పూర్తి చేస్తే వైసిపి హయాంలో నాయకులు 5 శాతం మాత్రమే పూర్తి చేశారని అన్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.200 కోట్లతో నియోజకవర్గంలో తాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. గతంలో ఇళ్లస్థలాలు రానివారికి ఇళ్ల స్థలాలు అందించేందుకు చర్యలు తీసకుంటున్నామన్నారు. భవిష్యత్తు తరాలు బాగుండాలంటే మరో 15 ఏళ్లు ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సైతం చెబుతున్నారని చెప్పారు. ఒరిస్సా, గుజరాత్ రాష్ట్రాలు సుస్థిరమైన పాలన కారణంగానే అభివృద్ధి జరుగుతోందని గుర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వాన్ని మరో 15 ఏళ్లు అధికారంలో ఉండే విధంగా ప్రజలు కృషి చేయాలన్నారు. దువ్వ, వయ్యేరు కారణంగా రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇందుకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ ఆరిమిల్లి

రొయ్యల సాగుపై అవగాహన

ప్రజాశక్తి - భీమవరం టౌన్


వర్షాకాలంలో రొయ్యల సాగుదారులకు పెద్ద సవాళ్లను తీసుకువస్తుందని, వాటిని అధిగమించి రొయ్యల సాగు విజయవంతంగా చేయడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ది వాటర్ బేస్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ఎం.శక్తి అన్నారు. ఈ మేరకు ఆదివారం వాటర్ బేస్ ఆధ్వర్యాన రొయ్యల రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు చెరువు ఉప్పుదనాన్ని (సెలనిటీ) గణనీయంగా తగ్గించి, నీటి ఉష్ణోగ్రతలను తగ్గిస్తుందని అలాగే చెరువు నీటిలో కరిగిన ఆక్సిజన్(డిఒ), పిహెచ్ వంటి కీలకమైన నీటి నాణ్యతా పరిమితులను మారుస్తుందన్నారు. సాధారణంగా వర్షం కురిసిన తర్వాత రెండు నుంచి మూడు రోజులలో రొయ్యల మరణాలు సంభవిస్తాయని, ఇవి అనాక్సియా(ఆక్సిజన్ లేకపోవడం), ఇన్ఫెక్షన్లు, ఒకదానిని ఒకటి తినేయడం, హైడ్రోజన్ సల్ఫైడ్ విషతత్వం (హెచ్‌టుఎస్ టాక్సిసిటీ), అధిక వర్షం వల్ల రొయ్యల మౌల్టింగ్‌లలో మార్పుల వంటి కారణాల వల్ల సంభవిస్తాయన్నారు. ఈ పరిస్థితులు తరచుగా మినరల్ సమతుల్యతను దెబ్బతీస్తాయని, విబ్రియో వంటి రోగకారక బ్యాక్టీరియాకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తాయన్నారు. నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ స్థాయిలను(డిఒ) నిలుపుకోవడం కోసం ఏరియేటర్లను నిరంతరం తిప్పడం, ముఖ్యంగా రాత్రి సమయంలో తిప్పాలన్నారు. నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్(డిఒ) తగ్గితే వెంటనే ఆక్సిజన్ బూస్టర్‌లను వాడాలన్నారు. భారీ వర్షపు సమయంలో ఆహారాన్ని 30 నుంచి 50 శాతం తగ్గించి, రొయ్యల కదలికలు, నీటి నాణ్యత సాధారణ స్థితికి వచ్చిన తర్వాత మాత్రమే మేతలు అవసరమైన మేరకు ఇవ్వడం వంటి స్మార్ట్ ఫీడింగ్ పద్ధతులను అనుసరించాలన్నారు. వీటితోపాటు మరికొన్ని తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ వర్షాకాల సీజన్ సమయంలో రొయ్యల సాగుదారులు పంటను రక్షించుకోవడానికి ఈ ముఖ్యమైన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రొయ్యల సాగు చేస్తున్న రైతులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

నరసాపురంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలోని 28వ వార్డులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ అఫైర్స్ అడ్వైజర్, మాజీ శాసనమండలి ఛైర్మన్ ఎం.ఎ.షరీఫ్, నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు ప్రతి ఇంటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లల విద్యా ప్రోత్సాహం, ఆరోగ్యం, పింఛన్లు, ఇళ్ల నిర్మాణం వంటి అంశాలపై వివరించారు. రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, మాజీ ఎఎంసి ఛైర్మెన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, శంకు భాస్కర్ నాయుడు, డాక్టర్ శిరిగినిడి రాజ్యలక్ష్మి, గుడాల సునీత, బొర్రా చిన్నాయమ్మ, నాగిడి రాంబాబు, మావూరి ఆనంద్ పాల్గొన్నారు.


జ్ఞాపిక అందుకుంటున్న బండి ప్రసాద్

బండి ప్రసాద్‌కు అభినందన జ్ఞాపిక

పెనుమంట్ర : మానవత సంస్థ ద్వారా సామాజిక సేవారంగంలో అన్ని తరగతుల ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న మానవత పెనుమంట్ర శాఖ కార్యదర్శి బండి ప్రసాద్‌కు మానవత ఫౌండర్ సి.రామచంద్రా రెడ్డి అభినందన జ్ఞాపిక అందించారు. ఆదివారం నల్లజర్లలో జరిగిన మానవతా సంస్థ జిల్లా సదస్సులో ఈ గౌరవం కార్యదర్శికి దక్కిందని శాఖ అధ్యక్షులు శిరం విశ్వనాథం ఇక్కడ తెలిపారు. మానవత విలువలతో కూడిన సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకుగాను జ్ఞాపిక ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా మండలంలో చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి సదస్సులో వివరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర శాఖ నుంచి ఛైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, పూర్వాధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, ట్రెజరర్ అమృతవాక్కుల సత్యనారాయణ, రీజనల్ ఛైర్మన్ బాణాల శ్రీనివాసరావు, ఇసి ఎడ్యుకేషన్ పడాల సువర్ణ గౌరి పాల్గొన్నారని తెలిపారు.

మంత్రి నిమ్మలపై అసత్య ఆరోపణలు తగవు

ఎఎంసి ఛైర్మన్ విజయ భాస్కర్

పాలకొల్లు : జగన్ అక్రమ సంపాదనతో పెట్టిన పత్రికపై ప్రజలకు విశ్వాసం లేదని పాలకొల్లు ఎఎంసి ఛైర్మన్ కోడి విజయ భాస్కర్ చెప్పారు. ఆదివారం ఆ పత్రికలో మంత్రి నిమ్మల రామానాయుడుపై ఇష్టానుసారంగా రాయడం పట్ల టిడిపి అగ్ర నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 3 సార్లు ప్రజలు వరుసగా నిమ్మలను మెజారిటీ పెంచుకుంటూ గెలుపించుకుంటున్నారని, ఆ పత్రిక ప్రోగ్రెస్ రిపోర్ట్ మంత్రికి అక్కర్లేదని వారు చెప్పారు. 2022లో ప్రోటోకాల్ ఉన్న నిమ్మల, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌లను స్టేజి మీద నుంచి గెంటివేసారని, ఆయనను చంపడానికి కూడా రమేష్ ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారని చెప్పారు. అదే పత్రిక నిమ్మల రామానాయుడు గత ఏడాదిగా రూ.600 కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేసారని ఎందుకు రాయలేదని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు పాల్గొన్నారు.